# అందం, అభినయాలకు నిజంగా శ్రీ దేవే



వెండితెరపై అతిలోకసుందరి ఎవరంటే మీరేం చెబుతారు?
మరీ ఈ కాలంనాటి బాలీవుడ్ సినీ అభిమానులైతే చటుక్కున ఐశ్వర్యారాయ్ అని అంటారు.
చాలా పాతకాలం నాటి తెలుగు సినిమాలు చూసిన వృద్ధులైతే ఏ కాంచనమాల పేరో సూచిస్తారు. కానీ అతిలోకసుందరి అని అనుకోగానే చాలామంది తెలుగువారికి గుర్తొచ్చే పేరు - శ్రీదేవి.
ఆమె ఓ అప్సరస!
సినీ తెరపై కదలాడిన దేవత!
ఇలా అనుకున్నవారు కోకొల్లలు. ఆమె జన్మదినం సందర్భంగా ఈ వ్యాసం.

తమిళనాడులోని శివకాశిలో 1963లో జన్మించిన శ్రీదేవి బాలనటిగా హిందీ, తెలుగు సినిమాలలో కనిపించారు.కేవలం నాలుగేళ్ళ వయసులోనే ఆమె సినీరంగంలోకి వచ్చారు. భక్తతుకారాం, మల్లమ్మకథ తదితర తెలుగు సినిమాలతో పాటు హిందీ, తమిళ సినిమాలలో కూడా నటించారు. తెలుగులో ఎన్టీఆర్ హీరోగా నటించిన బడిపంతులు సినిమాలో బాలనటిగా ఆమెపై ఏకంగా ఓ పాట కూడా ఉంది...'బూచాడమ్మా! బూచాడు' అని.



అప్పుడే కాదు.. ఇప్పటికీ ఈ పాటకు ఆదరణేమీ తగ్గలేదు. బాలనటిగా కొన్ని చిత్రాలలో నటించినా, యువనటిగా 'పదహారేళ్ల వయసు' చిత్రంతో తిరిగి చలనచిత్ర సీమలోకి వచ్చారు. ఆ సినిమాతో యువహృదయాలలో అలజడి రేపారు. ఇక అప్పటి నుంచీ హీరోయిన్‌గా ఏ దశలోనూ ఎదురుదెబ్బ అనేదే తగలని నటిగా ఎదిగారు. ఆకలిరాజ్యం, వసంత కోకిల వంటి తమిళ మాతృక సినిమాలు నటిగా ఆమెకు మంచి పేరు తెచ్చాయి. వైవిధ్యభరితమైన పాత్రలు ఆమెకు మొట్టమొదట లభించింది తమిళంలోనే, తెలుగులో ఎప్పుడూ గ్లామర్ పాత్రలకే పరిమితమయ్యారు. తెలుగు తమిళం ఆమెకు ఎంత గుర్తింపు వచ్చినా, హిందీ సినిమాలతో వచ్చిన ప్రతిష్ఠతో పోలిస్తే అది తక్కువే కదా! హిందీలో తొలిసినిమా హిమ్మత్‌వాలాలో నటించిన తర్వాత జాతీయ స్థాయిలో అభిమానులు ఏర్పడ్డారు.

హిందీలో నిర్మించిన నగీనా, మిస్టర్ ఇండియా, చాందిని, చాల్‌బాజ్ తెలుగు చిత్రాలు జగదేకవీరుడు- అతిలోకసుందరి, క్షణ-క్షణంలో శ్రీదేవి నటనను మర్చిపోగలరా ఎవరైనా? బహుశా ఎవరికీ మరపురాదు.



హిందీ చిత్రనిర్మాత బోనీకపూర్ వివాహమాడిన శ్రీదేవికి ఇద్దరు సంతానం.

ఎన్టీఆర్‌తో వేటగాడు, సర్దార్ పాపారాయుడు, అనురాగదేవత తదితర చిత్రాలలో , ఎఎన్ఆర్‌తో శ్రీరంగనీతులులో నటించారు. ఇంతకుముందు వీరిద్దరికీ మనవరాలిగా, కూతురుగా కూడా నటించడం వల్ల అప్పట్లో శ్రీదేవికి ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత ఎఎన్ఆర్ తనయుడు నాగార్జునతో ఆఖరిపోరాటం, గోవిందా-గోవిందా చిత్రాలలోనూ నటించారు. సాధారణంగా హీరోలతో పోలిస్తే, హీరోయిన్లకు సినీ జీవితం చాలా తక్కువకాలం ఉంటుంది. ఈ సిద్ధాంతానికి మినహాయింపుగా నిలిచింది బహుశా శ్రీదేవి ఒక్కరేనేమో! ఖుదాగవా, లంహే, గుమ్రాహ్, చాందినీ, చాల్‌బాజ్, లాడ్లా, జుదాయి, సద్మా చిత్రాలకు ఫిల్మ్ ఫేర్ అవార్డులు పొందారామె! ఇలా ఎన్నో అరుదైన రికార్డులతో పాటు, అందం, అభినయకౌశలం కలబోసిన నటి- శ్రీదేవి! ఆమెకు తెలుగువన్ చెబుతోంది జన్మదిన శుభాకాంక్షలు